అరకొరగా వైద్య సేవలు

- నూజివీడు ఏరియా ఆసుపత్రిలో వైద్యం ప్రహసనమే
- ఫ్రీజర్ లేని మార్చురీ

నూజివీడు: కూటమి ప్రభుత్వ హయాంలో ప్రజలకు వైద్య సేవలు అంతంతమాత్రంగానే అందుతున్నాయి. వైద్య ఆరోగ్యశాఖలో ఖాళీ పోస్టుల భర్తీ చేపట్టకపోవడంతో ఆసుపత్రుల్లో వైద్యుల కొరత వేధిస్తోంది. నూజివీడు ఏరియా ఆసుపత్రిలో వైద్య సేవలు అరకొరగానే అందుతున్నాయి. ఆసుపత్రికి వచ్చే రోగులు వైద్యుడి వద్ద చూపించుకోవాలంటే దానికి ముందు రిజిస్ట్రేషన్ చేసుకోవడం, ఓపీ స్లిప్ రాయించుకోవడం పెద్ద ప్రహసనంగా తయారైంది. దీని కోసం క్యూలో నిలబడలేక రోగులు ఇబ్బందులు పడుతున్నారు.

పలు వైద్య పోస్టులు ఖాళీ

నూజివీడు ఏరియా ఆసుపత్రిలో చిన్న పిల్లల వైద్యులు, రేడియాలజీ, చర్మ, జనరల్ సర్జన్, గైనిక్, సివిల్ సర్జన్ ఆర్ఎంఓ, డెప్యూటీ సివిల్ సర్జన్ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఆర్థో వైద్యుడు ఉన్నప్పటికీ క్యాంప్‌లతోనే సరిపోతోంది. చర్మ వైద్యుడు డిప్యుటేషన్‌పై వెళ్లిపోయి వేరే చోట విధులు నిర్వహిస్తున్నారు.

మార్చురీ పరిస్థితి దారుణం

ఏరియా ఆసుపత్రిలో మార్చురీ పరిస్థితి దారుణంగా ఉంది. ఆరు నెలలకు పైగా ఫ్రీజర్ లేకపోవడంతో ఆసుపత్రికి వచ్చే మృతదేహాలను పోస్టుమార్టం అయ్యే వరకు కూడా మృతుల సంబంధీకులే రూ.5 వేలు చెల్లించి ఫ్రీజర్‌లను అద్దెకు తెచ్చి భద్రపరుచుకోవాల్సి వస్తోంది. మంత్రి ప్రాతినిధ్యం వహిస్తోన్న నియోజకవర్గ కేంద్రంలోని ఆసుపత్రిలో ఇలాంటి దుస్థితి నెలకొన్నా పట్టించుకునే వారే లేరు. ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సమావేశం జరిగి దాదాపు ఏడు నెలలు కావడం గమనార్హం.


నూజివీడు ఏరియా ఆసుపత్రి

అధ్వానంగా ఆసుపత్రి ఆవరణ

ఆసుపత్రి ఆవరణలోని అంతర్గత రోడ్లన్నీ అధ్వానంగా తయారయ్యాయి. గోతులమయంగా ఉండటంతో ఆసుపత్రికి వచ్చే రోగులు ఇబ్బందులు పడుతున్నారు. ఎమర్జెన్సీ విభాగం వైపు రోడ్లు దారుణంగా ఉన్నాయి. ఏడాది క్రితం కురిసిన భారీ వర్షానికి ఆసుపత్రి గోడ రెండు చోట్ల కూలిపోగా, ఇప్పటి వరకు ప్రహరీ నిర్మించలేదు. దీంతో ఆసుపత్రి ఆవరణలో పశువులు, జీవాలు, కుక్కలు విచ్చలవిడిగా సంచరిస్తున్నాయి. అలాగే ఆగిరిపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఇద్దరు వైద్యులకు ఒకరు విధులు నిర్వహిస్తుండగా మరో వైద్యురాలు సెలవులో వెళ్లారు. ల్యాబ్ టెక్నీషియన్, పీహెచ్ఎన్, సూపర్‌వైజర్, హెల్త్ అసిస్టెంట్, నైట్ వాచ్‌మెన్, ఎస్ఏడబ్ల్యూ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. చాట్రాయి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం శిథిలావస్థలో ఉంది. దీంతో ఇక్కడ కుటుంబ నియంత్రణ శస్త్రచికిత్సలు జరగడం లేదు.


ఆసుపత్రి ఆవరణలో ఎమర్జెన్సీ వార్డు వైపు అధ్వానంగా ఉన్న రహదారి


ఏరియా ఆసుపత్రిలో పేర్లను ఆన్‌లైన్ చేయించుకునేందుకు రోగుల తంటాలు

క్లుప్తంగా

ఆర్థిక సాయం అందజేత



విస్సన్నపేట: తమతో కలిసి చదువుకున్న స్నేహితుడు అనారోగ్యంతో బాధపడుతుడటంతో పూర్వ విద్యార్థులు తమవంతు ఆర్థిక సాయం అందజేశారు. మండలంలోని కొర్లమండ గ్రామానికి చెందిన గొల్లపల్లి రాజారావు మెదడు సంబంధిత వ్యాధితో బాధపడుతున్నాడు. దీంతో చాట్రాయి మండలం చనుబండ జిల్లా పరిషత్ హైస్కూల్ 1996 పదో తరగతి పూర్వ విద్యార్థులు ఆదివారం రాజారావు ఇంటికి వెళ్లి పరామర్శించి తమ వంతు రూ. 50 వేలు ఆర్థిక సాయం, నూతన దుస్తులు అందజేశారు. పూర్వ విద్యార్థులు చెన్నారావు, నరసింహారావు, నాగేంద్రకుమార్, రఘు, పార్థసారధి రెడ్డి, రహీం, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

అధ్యాపకులకు శిక్షణ ప్రారంభం

మైలవరం: మైలవరం లకిరెడ్డి బాలిరెడ్డి ఇంజినీరింగ్ కళాశాల(ఎల్బీఆర్సీఈ) ఫిజిక్స్ విభాగంలో అధ్యాపక అభివృద్ధి శిక్షణా కార్యక్రమాన్ని సోమవారం ప్రారంభించారు. ఐదు రోజుల పాటు జరిగే ఈ కార్యక్రమంలో డీమిస్టిఫైయింగ్ క్వాంటమ్ కంప్యూటింగ్ ఫ్రం ఫండమెంటల్ టు ఫ్యూచర్ అప్లికేషన్స్ అనే అంశంపై ఆన్‌లైన్ శిక్షణ జరిగింది. ఐఐటీ - హైదరాబాద్ ప్రతినిధి డాక్టర్ అలోక్ కుమార్ రిసోర్స్ పర్సన్‌గా వ్యవహరించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ కే. అప్పారావు, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ బి. రమేష్‌రెడ్డి, ఫ్రెష్‌మాన్ ఇంజినీరింగ్ విభాగాధిపతి డాక్టర్ టి. సత్యనారాయణ, డాక్టర్ ఎమ్. శ్రీనివాసరావు, డీన్ అకాడమిక్స్ డాక్టర్ ఎస్.పిచ్చిరెడ్డి, డీన్ ఆర్అండ్‌డీ, భౌతిక శాస్త్ర విభాగ అధ్యాపకులు పాల్గొన్నారు.

ఘనంగా హర్ ఘర్ తిరంగా



కొండపల్లి(ఇబ్రహీంపట్నం): జాతీయ పతాకాన్ని ప్రతి భారతీయుడి ఇంటిపై సగర్వంగా ఎగరవేసి దేశభక్తిని చాటాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు అడ్డూరి శ్రీరామ్ సూచించారు. బీజేపీ ఆధ్వర్యంలో కొండపల్లిలో సోమవారం జరిగిన హర్ ఘర్ తిరంగా ర్యాలీలో ప్రజాప్రతినిధులు, విద్యార్థులు జాతీయ జెండాలు చేతబట్టి ర్యాలీ నిర్వహించారు. హర్ ఘర్ తిరంగా, వందేమాతరం అంటూ నినాదాలు చేశారు. బ్యాంక్ సెంటర్ నుంచి బీకాలనీ సెంటర్ వరకు ర్యాలీ జరిగింది. దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 75ఏళ్లు పూర్తయిన సందర్భంగా కేంద్ర ప్రభుత్వం ఈ కార్యక్రమం చేపట్టిందని వక్తలు తెలిపారు. మున్సిపల్ వైస్ చైర్మన్ చుట్టుకుదురు శ్రీనివాస్, నాయకులు నూతలపాటి బాలకోటేశ్వరరావు, రేగళ్ల రఘునాథరెడ్డి, టి.మాధురి, మారాసు కృష్ణమోహన్ తదితరులు పాల్గొన్నారు.

త్రిసభ్య కమిటీ ప్రమాణ స్వీకారం

మైలవరం: మైలవరం ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం త్రిసభ్య కమిటీ ప్రమాణ స్వీకారం స్థానిక సొసైటీ కార్యాలయ ప్రాంగణంలో సోమవారం జరిగింది. సొసైటీ చైర్మన్‌గా కరెడ్ల వెంకటనారాయణ, సభ్యులుగా ఒరుగు వెంకటేశ్వరరావు, భూక్యా కుమారి బాధ్యతలు స్వీకరించారు. మైలవరం ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్ కమిటీ సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కమిటీ సభ్యులు రైతులకు అండగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో సొసైటీ సభ్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

రెండు పూరిళ్లు దగ్ధం



చాట్రాయి: విద్యుత్ షార్టు సర్క్యూట్‌తో రెండు పూరిళ్లు దగ్ధమైన ఘటన మండలంలోని తుమ్మగూడెం దళితవాడలో సోమవారం మధ్యాహ్నం జరిగింది. మొలుగుమాటి అర్జున, మొలుగుమాటి ఆదియ్య ఇళ్లు పక్కపక్కనే ఉండటంతో పూర్తిగా కాలిపోయాయి. ఆ సమయంలో వాళ్లు పనులకు వెళ్లారు. బాధితులు వచ్చి పూర్తిగా కాలిపోయిన ఇళ్లు చూసి కన్నీటి పర్యంతమయ్యారు.

15 నుంచి ఉచిత యోగ శిక్షణ

కొండపల్లి(ఇబ్రహీంపట్నం): కొండపల్లి ఆర్యవైశ్య కల్యాణ మండపంలో ఈనెల 15 నుంచి సెప్టెంబర్ 7వ తేదీ వరకు ఉచిత యోగ శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్లు యోగ గురువు లంకే జనార్దన్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. శాంతివన్ యోగ ట్రస్ట్ ఆధ్వర్యంలో ప్రతిరోజూ ఉదయం, సాయంత్రం 6 నుంచి 7.15 గంటల వరకు శిక్షణ తరగతులు జరుగుతాయని చెప్పారు. ఈ శిక్షణను పట్టణ, పరిసర ప్రాంతాల ప్రజలు వినియోగించుకోవాలని ఆయన కోరారు.

చెరువుల అభివృద్ధికి చర్యలేవీ..?


చంద్రాలలో మరమ్మతులకు నోచుకోని చెరువు


చంద్రగూడెంలో అరకొర నీటితో ఉన్న చెరువు

- సాగునీటి సరఫరా లేకపోవడంతో రైతుల ఆందోళన
- పట్టించుకోని పాలకులు, అధికారులు

మైలవరం: చెరువుల అభివృద్ధికి కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకోవడం లేదని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వేసవిలో చెరువుల్లో పూడిక తీత పేరుతో మట్టి తవ్వి అమ్ముకోవడం తప్ప అభివృద్ధికి తీసుకున్న చర్యలు శూన్యం. ఈ ఏడాది కూడా సాగునీటి సరఫరా కష్టమేనని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మైలవరం నియోజకవర్గం పరిధిలోని రైతులు ముఖ్యంగా వరి, మొక్కజొన్న, కూరగాయల పంటలు, మామిడి సాగు చేస్తుంటారు. మూడో జోన్ కాలువల పరిధిలో అధికారిక ఆయకట్టు 2.10లక్షల ఎకరాలు ఉండగా నూజివీడు, మైలవరం పరిధిలో రెండు బ్రాంచి కాలువలు, ఎనిమిది మేజర్ కాలువలు ఉన్నాయి. వేసవిలో నీటి ఎద్దడి లేకుండా కాపాడాలని రైతులు వేడుకున్నా కూడా అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోలేదు. కొద్దిపాటి నీటి సరఫరాతో మమా అనిపించారు.

అరకొరగానే చెరువుల్లో నీరు

మూడో జోన్‌లోని మైలవరం, నూజివీడు బ్రాంచి కాలువలకు నవంబర్ నుంచి ఏప్రిల్ 15వ తేది వరకు నీటి సరఫరా చేయాల్సి ఉండగా రాష్ట్ర విభజన అనంతరం ఎగువ రాష్ట్రం నీటి విడుదలకు ఇబ్బందులు పెట్టింది. మూడో జోన్‌కు 32 టీఎంసీల నీటిని సరఫరా చేయాలనేది ఒప్పందం. ఈ ఏడాది కొద్దిపాటి నీటిని విడుదల చేసి మమా అనిపించారు. దీంతో రెడ్డిగూడెం మండలంలో నాలుగు చెరువులు, మైలవరం మండలంలోని రెండు చెరువులకు తప్ప మిగిలిన చెరువులకు నీరు అందలేదు. దీంతో మూడొంతులకు పైగా చెరువుల్లో అరకొరగానే నీరు ఉంది. మైలవరంలోని పంగిడి చెరువును పూర్తిగా ఒక్కసారి నింపితే రెండేళ్ల వరకు సాగునీటికి కొరత ఉండదు. చెరువులు అడుగంటితే భూగర్భ జలాలు కూడా అడుగంటే ప్రమాదం ఉందని రైతులు వాపోతున్నారు. కాగా ఇటీవల వచ్చిన వరదకు మైలవరం మండలం, చంద్రాలలోని చెరువుకు గండి పడి నీరంతా వృధాగా పోయింది. నెలలు గడచినా ఈ చెరువుకు పడిన గండిని పటిష్టం చేయడానికి అధికారులు ఎటువంటి చర్యలు తీసుకోలేదు. మరోసారి భారీ వర్షాలు కురిస్తే మళ్లీ చెరువు కట్ట తెగి గ్రామం మీద పడుతుందని గ్రామస్తులు భయాందోళన చెందుతున్నారు.

ముసునూరు జెడ్పీ హైస్కూల్ తనిఖీ

ముసునూరు: విద్యార్థిలంతా సమగ్రంగా పరీక్షలు రాసే విధానం అలవాటు చేసుకోవాలని ఎంఈఓ-2 బీవీఎస్ సుబ్బారావు సూచించారు. ముసునూరు జెడ్పీ హైస్కూల్ ప్లస్‌లో జరుగుతున్న ఫార్మేటివ్ అసెస్‌మెంట్ పరీక్షలను సోమవారం ఆయన తనిఖీ చేశారు. పరీక్షా విధానంలో మార్పులు చేస్తూ ప్రభుత్వం ప్రవేశ పెట్టిన బుక్‌లెట్, ఓఎంఆర్ షీట్ పద్ధతిలో పరీక్షలు రాయడం అలవాటు చేసుకోవాలని అన్నారు. అనంతరం మధ్యాహ్న భోజన నాణ్యతను పరిశీలించారు.

రూ.లక్ష విలువైన రుద్రమంటపం వితరణ



తిరువూరు: గంపలగూడెం మండలం పెనుగొలను శివాలయానికి బెంగుళూరుకు చెందిన విజయకుమార్ దంపతులు సోమవారం రుద్రమంటపం వితరణ ఇచ్చారు. రుద్రాభిషేకం, విశేష పూజల అనంతరం పరమేశ్వరుడికి అలంకరణ నిమిత్తం రూ.లక్ష విలువైన రుద్రమంటపాన్ని వితరణగా అందజేసినట్లు ఆలయ అర్చకుడు దాములూరి రామలింగేశ్వరశర్మ తెలిపారు.

రామలింగేశ్వరునికి విభూది అభిషేకం



తిరువూరు: స్థానిక బస్టాండు సెంటర్‌లోని శ్రీరామలింగేశ్వరాలయంలో సోమవారం శ్రావణ మాస సందర్భంగా స్వామివారికి విభూదితో అభిషేకం చేశారు. ఆలయ ప్రధానార్చకులు భవాని రాధాకృష్ణ, కాసావజ్ఝల రామచంద్రమూర్తిల ఆధ్వర్యంలో పంచామృతాలు, విభూదితో అభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

కార్మికుల హక్కుల సాధనకు పోరాటమే మార్గం

సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు వెంకటేశ్వరరావు

విస్సన్నపేట: తమ హక్కుల కోసం పోరాటమే మార్గంగా కార్మికులు ముందుకు రావాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఎ.వెంకటేశ్వరరావు పిలుపునిచ్చారు. స్థానిక బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ కార్యాలయంలో సోమవారం విస్సన్నపేట సీఐటీయూ మహాసభను నిర్వహించారు. జిల్లా అధ్యక్షుడు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మికుల హక్కులను పూర్తిగా నాశనం చేస్తున్నాయని తెలిపారు. కనీస వేతన సవరణ చట్టం పేరుతో వేతనాలు తగ్గించి పెట్టుబడిదారులకు అనుకూలంగా వ్యవహరిస్తున్నాయని పేర్కొన్నారు. కార్మికుల హక్కుల కోసం పోరాడుతున్న వారిపై కేసులు పెడుతూ వారిని అనిచివేయాలని చూస్తున్నారని మండిపడ్డారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు వి. నాగరాజు, జిల్లా నాయకులు బి.వెంకటేశ్వరరావు, బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు ఆకుల శ్రీనివాసరావు పాల్గొన్నారు.

రేపు సర్వసభ్య సమావేశం

విస్సన్నపేట: స్థానిక మండల పరిషత్ సాధారణ సర్వసభ్య సమావేశం ఎంపీపీ పిల్లి మెర్సీ వనజాక్షి అధ్యక్షతన ఈ నెల 13వ తేది మధ్యాహ్నం రెండు గంటలకు నిర్వహించనున్నట్లు ఇన్‌చార్జీ ఎంపీడీఓ ప్రసాద్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. వెలుగు కార్యాలయం మీటింగ్ హాలులో జరిగే ఈ సమావేశానికి సభ్యులు, మండల అధికారులు హాజరు కావాలని ఆయన సూచించారు.

అర్జీల పరిష్కారంలో అలసత్వం వద్దు

సబ్ కలెక్టర్ వినూత్న

నూజివీడు: ప్రజల నుంచి వచ్చిన అర్జీల పరిష్కారంలో అలసత్వం వహించకుండా గడువులోగా పరిష్కరించాలని సబ్‌కలెక్టర్ బొల్లిపల్లి వినూత్న అధికారులను ఆదేశించారు. పట్టణంలోని సబ్‌కలెక్టర్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదికను నిర్వహించారు. ఈ సందర్భంగా సబ్‌కలెక్టర్ మాట్లాడుతూ అర్జీల పరిష్కారానికి నిర్దిష్ట కాలపరిమితిని విధించామని, గడువులోగా నాణ్యమైన పరిష్కారాన్ని చూపాలన్నారు. ఒకవేళ గడువులోగా సమస్యను పరిష్కరించలేకపోతే అందుకు సంబంధించిన సరైన కారణాన్ని అర్జీదారుడికి తెలియజేయాలని సూచించారు. ప్రజల నుంచి 27 అర్జీలు రాగా వాటిని సంబంధిత అధికారులకు పంపారు. కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ చిలుకూరు భాస్కరరెడ్డి, డీఎల్‌పీఓ ఎంపీఎస్ సుందరి, హెచ్ఓ ఆర్.హేమ, సీడీపీఓ పిల్లి విజయకుమారి, ట్రిపుల్ ఐటీ ఎస్ఐ జి. రాంబాబు, కోఆపరేటివ్ అసిస్టెంట్ రిజిస్ట్రార్ బి. నాగలక్ష్మి, డీఎల్‌డీఓ పి. వెంకటరత్నం తదితరులు పాల్గొన్నారు.

ఎస్ఐఆర్ పేరుతో ఓట్లను తొలగించడం అన్యాయం

చాట్రాయి: బిహార్‌లో ఎస్ఐఆర్ పేరుతో ఓట్లను తొలగించడం అన్యాయమని ఆల్ ఇండియా సెంట్రల్ కౌన్సిలింగ్ ఆఫ్ ట్రేడ్ యూనియన్ జిల్లా కార్యదర్శి వేముల బక్కయ్య డిమాండ్ చేశారు. మండలంలోని చిత్తపూరులో సోమవారం నిర్వహించిన నిరసన ర్యాలీలో ఆయన పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ బిహార్‌లో 64 లక్షల ఓట్లు తొలగించిన అధికారులను విధుల నుంచి తప్పించాలని డిమాండ్ చేశారు. తొలగించిన ఓటర్లను తిరిగి జాబితాలో చేర్చాలని కోరారు. యూనియన్ నాయకులు చాట్ల బాబూరావు, పి. భవానీ, కె.వెంకటేశ్వరరావు, తిరుపతిరావు పాల్గొన్నారు.


నిరసన వ్యక్తం చేస్తున్న నాయకులు

అడుగుకో గుంత..


వెల్వడంలో గుంతలమయంగా మారిన ఆర్అండ్‌బీ రహదారి

మైలవరం: మైలవరం మండలం వెల్వడంలోని భాస్కరనగర్, గణపవరం రోడ్లు గుంతలమయంగా మారడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇటీవల కురిసిన వర్షాలకు రోడ్డుపై కంకర కొట్టుకుపోయి గుంతలమయంగా మారింది. మైలవరం నుంచి వెల్వడం, చంద్రాల గ్రామాల మీదుగా నూజివీడు వెళ్లే ప్రధాన ఆర్అండ్‌బీ రహదారి, అదేవిధంగా గణపవరం గ్రామాలకు వెళ్లే రహదారులు గుంతలు ఏర్పడి పాదచారులు, వాహనచోదకులకు తీవ్ర అసౌకర్యంగా మారాయి. గుంతల్లో పడి వాహనాలు తరచూ మరమ్మతులకు గురవుతున్నాయంటూ వాహన చోదకులు వాపోతున్నారు. ఇటీవల రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలని ఆయా గ్రామాల వాసులు నిరసన ప్రదర్శలు చేశారు. దీనిపై స్పందించిన ఆర్అండ్‌బీ అధికారులు నిధులు మంజూరు కాగానే మరమ్మతులు చేపడతామని చెప్పారు.

నేడు ట్యాక్స్ పేయర్స్ సమావేశం

మైలవరం: మైలవరం ఛాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీస్ ఆధ్వర్యంలో మంగళవారం సాయంత్రం నాలుగు గంటలకు స్థానిక శ్రీవెంకటేశ్వరస్వామి దేవస్థానం కల్యాణ మండపంలో మండల ట్యాక్స్ పేయర్స్ సమావేశం జరుగుతుందని నిర్వాహకులు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆదాయ పన్ను శాఖ విజయవాడ, అధికారి పి. అనిల్‌కుమార్ హాజరవుతారన్నారు. ఇన్‌కమ్ ట్యాక్స్ డిపార్ట్‌మెంట్(టీడీఎస్) విజయవాడ ఆదాయ పన్ను శాఖ వారిచే టీడీఎస్ అండ్ టీసీఎస్ నిబంధనలు, అనుసరించాల్సిన విధానాలపై అవగాహన కల్పించడం జరుగుతుందని తెలిపారు.

బహుముఖ ప్రతిభాశాలి తుర్లపాటి

విజయవాడ కల్చరల్: బహుముఖ ప్రతిభాశాలి తుర్లపాటి కుటుంబరావు అని మాజీ మేయర్ జంధ్యాల శంకర్ అన్నారు. తెలుగు కళావాహిని, శ్రీ కళాభారతి, జీఆర్‌కే, పోలవరపు సాహితీ సమితి ఆధ్వర్యంలో సీనియర్ పాత్రికేయుడు తుర్లపాటి కుటుంబరావు జయంతి గాంధీనగర్‌లోని కౌతా పూర్ణానందం కళావేదికపై సోమవారం నిర్వహించారు. జంధ్యాల శంకర్ మాట్లాడుతూ సుదీర్ఘకాలం పాత్రికేయరంగంలో విలువలు చాటుకున్న మహనీయుడు తుర్లపాటి సేవలను నేటి తరం యువ పాత్రికేయులు ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. స్నేహానికి మారుపేరు తుర్లపాటి అని పేర్కొన్నారు. అటు రాజకీయరంగం, ఇటు పత్రికా రంగంలోనూ ఆయనకు శత్రువులు లేరన్నారు. బ్రాహ్మణ సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కొప్పరపు బలరామకృష్ణ మూర్తి మాట్లాడుతూ ఆయన దాదాపు 50 సంవత్సరాలపాటు వార్తలలోని వ్యక్తి పేరుతో శీర్షికను ఒక పత్రికలో నిర్వహించారని చెప్పారు. రాష్ట్రంలోని పలువురు ముఖ్యమంత్రుల తోనూ నాటి ప్రధాని ఇందిరా గాంధీతో మొదలుకొని నేటి ప్రధాన మంత్రి మోదీతో వర్తమాన సమస్యలపై ఉత్తరాలు రాసేవారన్నారు. కార్యక్రమంలో గోళ్ళ నారాయణరావు, బోడి ఆంనేయరాజు, సంగీత విద్వాంసుడు కేవీ బ్రహ్మానందరావు, కె. డేవిడ్ రాజు, బి.వీరభద్రరావు, శింగంశెట్టి చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు. సంగీత విద్వాంసుడు బ్రహ్మానందరావును నిర్వాహకులు సత్కరించారు. గాయనీ గాయకులు పలు చిత్రగీతాలను ఆలపించారు. తుర్లపాటి అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.


బ్రహ్మానందరావును సత్కరిస్తున్న నిర్వాహకులు

విద్యుత్ విజిలెన్స్ తనిఖీలు

నున్న(విజయవాడరూరల్): నున్న గ్రామంలో విద్యుత్ విజిలెన్స్ అధికారులు సోమవారం తనిఖీలు నిర్వహించారు. విజిలెన్స్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీరు విజయకుమారి ఆధ్వర్యంలో 39 బృందాలు విద్యుత్ తనిఖీలలో పాల్గొని 2,946 సర్వీసులను తనిఖీ చేశారు. నిబంధనలను అతిక్రమించి విద్యుత్‌ను అదనంగా వాడుకుంటున్న 215 సర్వీసులకు గాను 387 కిలోవాట్ల విద్యుత్‌ను వినియోగించినట్లు అధికారులు గుర్తించారు. వారి నుంచి రూ. 7.74 లక్షలను అపరాధ రుసుం వసూలు చేశారు. ఈ తనిఖీల్లో ఆపరేషన్ ఈఈ పి.హరిబాబు, డీఈఈ రామ్మూర్తి, పలువురు అధికారులు పాల్గొన్నారు.


విద్యుత్ తనిఖీల్లో పాల్గొన్న అధికారులు

వర్మీ కంపోస్టు స్టాల్ పరిశీలన

కంచికచర్ల: వర్మీ కంపోస్టు ఎరువుల వాడకం వల్ల తక్కువ ఖర్చుతో పాటు అధిక ఫలసాయం పొందవచ్చని జిల్లా పంచాయతీ అధికారి లావణ్యకుమారి అన్నారు. స్థానిక గ్రామ పంచాయతీ కార్యాలయ సిబ్బంది సోమవారం విజయవాడ కలెక్టరేట్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన వర్మీ కంపోస్టు ఎరువుల విక్రయ స్టాల్‌ను సందర్శించారు. వర్మీ కంపోస్టు ఎరువులు తడి చెత్త, పొడి చెత్త ద్వారా తయారు చేశారు. ఈ ఎరువులను తక్కువ నగదుకు విక్రయిస్తున్నారని పంచాయతీ సిబ్బంది తెలిపారు.

పత్తి, మిర్చి పంటల్లో సస్యరక్షణ చర్యలు తీసుకోవాలి


శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న డెప్యూటీ డైరెక్టర్ మనోజ్ పూరీ గోస్వామి

గరికపాడు(జగ్గయ్యపేట): రైతులు పత్తి, మిర్చి, మొక్కజొన్న పంటల్లో సమగ్ర సస్యరక్షణ చర్యలను అవలంబించాలని కేంద్రీయ సమగ్ర సస్యరక్షణ కేంద్రం డెప్యూటీ డైరెక్టర్ మనోజ్ పూరీ గోస్వామి సూచించారు. గ్రామంలోని కేవీకేలో సమగ్ర సస్యరక్షణ పద్ధతులపై రైతులు, వ్యవసాయాధికారులకు సోమవారం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంటల సాగు సమయంలో రైతులు అధికారులు, శాస్త్రవేత్తల సలహాలు, సూచనలు తీసుకోవాలన్నారు. పురుగు మందులను అధిక మోతాదులో వాడకూడదని జీవ రసాయన ఎరువులు వాడటం వల్ల అధిక దిగుబడులు పొందవచ్చని చెప్పారు. శాస్త్రవేత్తలు కూడా రైతులకు క్షేత్ర స్థాయిలో సస్యరక్షణ పద్ధతులను వివరించాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో సస్యరక్షణ అధికారి ప్రేమరంజితం, కేవీకే కోఆర్డినేటర్ అచ్యుతరాజు, వ్యవసాయ పరిశోధనా స్థానం శాస్త్రవేత్త కృష్ణంరాజు, శాస్త్రవేత్త వీరయ్య చౌదరి, రైతులు, వ్యవసాయ పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.

ర్యాగింగ్‌కు పాల్పడితే చర్యలు

గండ్రాయి(జగ్గయ్యపేట): విద్యాసంస్థల్లో ర్యాగింగ్ నిషేధమని, నిబంధనలకు విరుద్ధంగా ర్యాగింగ్‌కు పాల్పడితే చర్యలు తప్పవని శక్తి టీం ఏఎస్ఐ హనుమయ్య హెచ్చరించారు. మండలంలోని చిల్లకల్లు, బలుసుపాడు గ్రామాల్లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో ర్యాగింగ్, బ్యాడ్ టచ్.. గుడ్ టచ్ తదితర విషయాలపై సోమవారం విద్యార్థులకు అవగాహన కలిగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు అసాంఘిక కార్యకలాపాలపై దృష్టి సారించకుండా శ్రద్ధగా చదువుకుని ఉన్నత స్థాయికి చేరాలని సూచించారు. విద్యార్థినులు బ్యాడ్ టచ్.. గుడ్‌టచ్‌పై పూర్తి అవగాహన కలిగి ఉండాలని తెలిపారు. కార్యక్రమంలో మహిళా పోలీసులు, ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.